సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 16 । సెప్టెంబర్ । 2025



అతివల ఆరోగ్యంపై నజర్

మహిళలకు ఈనెల 17 నుంచి అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సిద్ధమైంది. 8లో



యూరియా కోసం తోపులాట

జూలూరుపాడు పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని చోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్వల్పంగా పెరుగుతున్న గోదావరి



గోదావరి ప్రవాహం ఇలా..

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం నెమ్మదిగా పెరుగుతోంది. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 32 అడుగుల నీటిమట్టం ఉండగా.. శనివారం రాత్రి 33.60 అడుగులకు చేరుకుని మళ్లీ తగ్గింది. ఎగువన ప్రాజెక్టుల నుంచి వరద ప్రవాహం భారీగా వస్తుండడంతో మళ్లీ ఆదివారం ఉదయం నుంచి 36.20 అడుగులకు, సోమవారం మధ్యాహ్నం 39.20 అడుగులకు చేరింది. రాత్రి 9 గంటల సమయాన 39.50 అడుగులుగా నమోదైంది. దీంతో అధికారులు స్నాన ఘట్టాల వద్ద ఐరెన్ మెష్‌లు అడ్డుపెట్టి భక్తులు నదిలోకి దిగకుండా చూస్తున్నారు.

నానో యూరియా వినియోగించాలి



రైతులతో మాట్లాడుతున్న బాబూరావు

సుజాతనగర్: నానో యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు అన్నారు. స్థానిక సొసైటీ గోడౌన్‌లోని యూరియా నిల్వలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఒకరికి ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారని, కనీసం రెండు బస్తాలు ఇచ్చేలా చూడాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. యూరియా బస్తాలకు బదులు నానో యూరియా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ నర్మద, ఏఈఓ ప్రనూష తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఆర్డీఓ మధు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆర్డీఓ మధు దరఖాస్తులు స్వీకరించారు. కొత్తగూడెం, జూలూరుపాడు, అశ్వారావుపేట, సుజాతనగర్, దమ్మపేట, ఇల్లెందు, పాల్వంచ, ములకలపల్లి మండలాల నుంచి ప్రజలు హాజరై వినతులు అందజేశారు. కార్యక్రమంలో డీఏఓ శకుంతల, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో అధికారులు

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని, ఇందుకోసం సైన్స్ సెమినార్లు ఉపయోగపడతాయని విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయి సెమినార్‌లో ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్రస్థాయికి, అక్కడ ప్రథమ స్థానంలో నిలిచినవారు జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. కాగా, 'క్వాంటం ఏజ్ బిగిన్స్, పొటెన్షియల్స్ అండ్ చాలెంజెస్' అంశంపై జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొని వారి అభిప్రాయాలు వెల్లడించారు. ఇల్లెందు టీటీడబ్ల్యూఆర్ఎస్‌కు చెందిన బి.లాస్యశ్రీ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైందని, ద్వితీయ స్థానంలో కొమ్ముగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి వేదవ్యాస నిలవగా, కళ్యాణ రమణి, పూజిత ప్రోత్సాహక బహుమతి సాధించారని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా జి.అనురాధ, ఎస్.యశోద వ్యవహరించారు.



రజాకార్లతో రణం చేసి..

రైతాంగ పోరాటానికి బాటలు వేసిన ఖమ్మం మహాసభ

- వరుసదాడులతో ఆయుధాలు సమకూర్చుకున్న విప్లవకారులు
- పాల్వంచలో రజాకార్లతో తలపడిన కోయ దళాలు
- గుంపెనలో కమ్యూనిస్టు దళంపై నిజాం సైన్యం దాడి
- సంఘం పోరాటంతో సింగరేణి కార్మికులకు దక్కిన హక్కులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆంధ్ర మహాసభ ప్రభావం ఎక్కువగా ఉండేది. చిర్రావూరి లక్ష్మీనర్సయ్య, సర్వదేవభట్ల రామనాథం వంటి నాయకులు ఇక్కడ పార్టీని బలోపేతం చేశారు. 12వ ఆంధ్ర మహాసభ 1945లో ఖమ్మంలో సుమారు ఇరవై వేల మందితో జరిగింది. ఈ సభ స్ఫూర్తితోనే నిజాం రాజుకు వ్యతిరేకంగా పోరాడగలమనే ధీమా విప్లవకారులకు వచ్చింది. దీంతో 1946 జూలై 4న తెలంగాణ సాయుధ పోరాటం వరంగల్ జిల్లాలోని విస్నూర్ గడి కేంద్రంగా రగులుకుంది. దీంతో ముందుజాగ్రత్తగా ఖమ్మం, మధిర, బోనకల్, నేలకొండపల్లి, కల్లూరు, వైరా, ఇల్లెందు, పాల్వంచ, ములకలపల్లి వంటి ప్రాంతాల్లో రజాకార్లు క్యాంపులు ఏర్పాటుచేశారు. గ్రామాల్లోకి కమ్యూనిస్టులు రాకుండా, సంఘాలు ఏర్పాటు చేయకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు.

పాల్వంచలో కోయదళంపై దాడి..

వేంసూరు సంస్థానంలో భూపంపిణీ చేసిన దళాలు తమ తదుపరి కార్యక్షేత్రంగా పాల్వంచ సంస్థానానికి చేరుకున్నాయి. ఇక్కడ 120 మంది ఆదివాసీ/కోయ యువకులతో గెరిల్లా దళం ఏర్పాటు కాగా, భూపంపిణీ మొదలైంది. దాన్ని అణచివేసేందుకు నిజాం సర్కార్ వేయి మంది సైనికులను పాల్వంచ తాలూకాకు పంపింది. పదిహేను రోజుల పాటు జరిగిన పోరులో ఎనిమిది మంది నిజాం సైనికులు చనిపోయారు. అలాగే, గెరిల్లా దళ నాయకుడు ముత్యాలు మృతిచెందగా మరో ఆరుగురిని నిజాం సర్కార్ ఉరి తీసింది. ఆ తర్వాత రజాకార్ దళాలు ములకలపల్లిలో క్యాంపు ఏర్పాటు చేశాయి. పాల్వంచలో నష్టపోయిన కోయ దళాలు ములకలపల్లిలోని రజాకార్ క్యాంపుపై దాడులు చేశాయి. చివరకు బతుకుజీవుడా అంటూ ఈ క్యాంపును ఎత్తివేయాల్సి వచ్చింది.

గుంపెన పోరాటం..

అన్నపురెడ్డిపల్లి మండలం గుంపెన గ్రామంలో 1948లో రజాకార్లకు – సాయుధ పోరాట యోధులకు మధ్య భీకర కాల్పులు జరిగాయి. వట్టికుంట నాగేశ్వరరావు నేతృత్వంలో గుంపెనలో సమావేశమైన 70మంది సభ్యులతో కూడిన దళాన్ని కల్లూరు నుంచి భారీ సంఖ్యలో వచ్చిన రజాకార్లు చుట్టుముట్టారు. దీంతో విప్లవకారులు ప్రాణాలకు తెగించి పోరాడుతూ అడవుల్లోకి వెళ్లిపోయారు. ఈ దాడిలో ఒక గెరిల్లా, మరో ఇద్దరు గుంపెన గ్రామస్తులు చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత దళాల నిర్వహణపై కొత్త నిబంధనలు అమల్లోకి తెచ్చారు. సాయుధ దళంలో 20కి మించి సభ్యులు ఉండకూడదనే తీర్మానం చేశారు.

కార్మిక సంఘం ఏర్పాటు..

సింగరేణి పారిశ్రామిక ప్రాంతంలో 1938లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రహస్యంగా ఏర్పడింది. హెడ్డాఫీసులో క్లర్క్‌గా పనిచేస్తున్న శేషగిరిరావు పోరాటంలో మొదటి అడుగు వేశారు. శేషగిరిరావు నేతృత్వంలో సాయుధ దళాలు రంగంలోకి దిగి కార్మికుల హక్కుల కోసం పోరాడాయి. ఫలితంగా కాంట్రాక్టు విధానం రద్దయి ఉద్యోగులనే గుర్తింపు వచ్చింది. మహిళలు, పిల్లలను గనుల్లో పని చేయించడంపై నిషేధం విధించగా.. ఉపాధి కోల్పోయిన మహిళలకు సింగరేణి పవర్ ప్లాంట్లలో పని కల్పించారు. చివరకు శేషగిరిరావును 1948 ఏప్రిల్‌లో నెల్లిపాక వద్ద నిజాం పోలీసులు కాల్చి చంపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాయుధ రైతాంగ పోరాటం జోరందుకునే సమయంలో 1948 సెప్టెంబర్ 13 నుంచి 17 వరకు జరిగిన 'ఆపరేషన్ పోలో' అనే పోలీస్ చర్యతో నిజాం సర్కార్ కుప్పకూలింది. హైదరాబాద్ స్టేట్ భారత్‌లో విలీనమైంది. ఆ తర్వాత జరిగిన మలి దశ పోరాటానికి భద్రాద్రి జిల్లా అడవులే కేంద్ర స్థానాలయ్యాయి.

ఆయుధాల సేకరణ..

కృష్ణా జిల్లా నందిగామ తాలూకాలో పరిటాల సమీపాన పోలీస్ హెడ్‌క్వార్టర్‌పై విప్లవకారులు దాడి చేసి ఆయుధాలు సంపాదించారు. ఆ తర్వాత మోటమర్రిలో మిలిటరీ క్యాంపుపైనా దాడి చేశారు. ఆపై మైదాన ప్రాంతాల్లోని జమీందార్ల గడీలు, ఇళ్లపై దాడులు చేస్తూ ఆయుధ సంపత్తి పెంచుకున్నారు. దీంతో గ్రామ దళాలకు బర్మార్లు, గెరిల్లా పోరాటం చేసేవారికి షాట్‌గన్‌లు, ఆపై స్థాయిలో ఉండేవారికి 12 బోర్ రైఫిళ్లు అందుబాటులోకి వచ్చాయి. వీరితో 50 గ్రామాల్లో ప్రత్యేక రక్షక దళాలు ఏర్పడ్డాయి. మరోవైపు గిరిజన ప్రాంతాలకు వెళ్లిన కామ్రేడ్లు 'ఫారెస్టు' జులుంను అడ్డుకుని కోయ ప్రజల నమ్మకం పొందారు. ఫలితంగా 1948 ఏప్రిల్ నాటికి జిల్లాలో సుమారు వేయి మంది కోయ సభ్యులు గెరిల్లా పోరాటంలో భాగస్వాములయ్యారు.

శ్రీకృష్ణుడిగా భద్రగిరి రామయ్య



స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

- రామాలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు
- నేడు ఉట్ల పండుగకు ఏర్పాట్లు

భద్రాచలం : 'జో అచ్యుతానంద.. జోజో ముకుందా..' అంటూ చిలిపి కృష్ణయ్యగా మారిన భద్రాద్రి రామయ్యకు వేదపండితులు, అర్చకులు జోలలు పాడారు. దశావతారాల్లో ఒకటైన శ్రీకృష్ణుడిగా దర్శనమిచ్చిన రామచంద్రస్వామిని తిలకించిన భక్తులు తరించారు. రామయ్య సన్నిధిలో సోమవారం ఊంజల్ సేవను వైభవోపేతంగా నిర్వహించారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీ వైష్ణవ సంప్రదాయం ప్రకారం సోమవారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలు కనులపండువగా జరిపారు. స్వామి వారికి సాయంత్రం దర్బార్ సేవ నిర్వహించాక బేడా మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో వేంచేపు చేసి ఊంజల్ సేవ నిర్వహించారు. ఆస్థాన గాయకులు, అర్చకులు జోలలు..లాలలు పాడారు. స్వామివారికి పంచామృతాభిషేకం చేసి తొమ్మిది రకాల ప్రసాదాలను నివేదన చేశారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు కేఈ స్థలశాయి భాగవతంలోని శ్రీకృష్ణ జనన ఘట్టాన్ని భక్తులకు వివరించారు. వేడుకల్లో భాగంగా మంగళవారం దేవస్థానం ఆధ్వర్యంలో ఉట్ల పండుగ నిర్వహించనుండగా ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముత్తంగి అలంకరణలో రామయ్య..

దేవస్థానంలో మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఎస్‌ఐఆర్ నిర్వహణకు సిద్ధంగా ఉండాలి

వీసీలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

సూపర్‌బజార్(కొత్తగూడెం)/భద్రాచలం : స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై సోమవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం ఐటీడీఏ నుంచి పీఓ రాహుల్ పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 2002లో నియోజకవర్గాల వారీగా గ్రామాల వివరాలు, ప్రస్తుతం ఉన్న రెవెన్యూ గ్రామాల వివరాలతో సమన్వయం చేయాలని సూచించారు. మ్యాపింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని, రెవెన్యూ మ్యాప్‌ను శుక్రవారం లోగా అందజేయాలని సూచించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ రంగాప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

2

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

ఎస్పీ రోహిత్‌రాజు



డీఎస్పీకి ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ

కొత్తగూడెంటౌన్: ప్రతీ కేసులో సమగ్ర దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చూడాలని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఆయన పోలీస్ అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంలో బాధ్యతగా వ్యవహరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ వాహనాలతో అధికారులు, సిబ్బంది నిరంతరం పెట్రోలింగ్ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గంజాయి, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను (బ్లాక్ స్పాట్‌లను) గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకారం తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, రవీందర్‌రెడ్డి, చంద్రభాను తదితరులు పాల్గొన్నారు.

వినిపించని ప్రజా'వాణి'!

- ప్రచార లోపంతో గ్రీవెన్స్‌కు ప్రజలు దూరం
- ఖాళీగా దర్శనమిస్తున్న డివిజన్ కార్యాలయాలు
- మండల కేంద్రాల్లోనూ అదే పరిస్థితి



సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా ఉన్న భద్రాచలం సబ్ కలెక్టరేట్

భద్రాచలం: డివిజన్, మండలాల పరిధిలోనే ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ చేపట్టిన 'ప్రజావాణి'కి ప్రజల నుంచి స్పందన కరువైంది. సాధారణంగా ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహిస్తారు. అయితే ప్రజావాణి కార్యక్రమాన్ని డివిజన్, మండలాల పరిధిలోనే నిర్వహించాలని మూడు వారాల క్రితం కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కొత్తగూడెంలో ఆర్డీఓ, భద్రాచలంలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో, మండలాల్లో తహసీల్దార్ల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సమస్యలపై వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చే వారి నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఇన్‌వార్డ్ ఇన్‌చార్జ్‌ను ఏర్పాటు చేశారు.

ప్రజల నుంచి స్పందన కరువు..

కలెక్టర్ ఆదేశాల మేరకు భద్రాచలం సబ్ కలెక్టరేట్, కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహిస్తున్నా.. ప్రజలు మాత్రం ఫిర్యాదులు ఇచ్చేందుకు రావడం లేదు. భద్రాచలం సబ్ కలెక్టరేట్‌లో మూడు వారాలుగా ఒక్క సమస్య కూడా నమోదు కాకపోవడం గమనార్హం. మండల కేంద్రాల్లో నిర్వహించిన ప్రజావాణిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఫిర్యాదుదారులు రాక కార్యాలయాలు వెలవెలబోతున్నాయి. ఈ సోమవారం భద్రాచలం మండల కార్యాలయంలో ఒకటి, దుమ్ముగూడెంలో ఐదు, చర్లలో ఏడు, బూర్గంపాడులో ఐదు, అశ్వాపురంలో ఏడు, పినపాకలో ఆరు, కరకగూడెంలో మూడు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. మణుగూరులో మాత్రం 51 మంది పలు సమస్యలపై వినతులు ఇచ్చారు.

ప్రచార లోపమే కారణం !

ప్రజావాణి కార్యక్రమాలకు స్పందన కరువవడానికి ప్రచార లోపమే కారణమని పలువురు భావిస్తున్నారు. సోషల్ మీడియాలో అధికారులు ఆదివారం రాత్రి 7 గంటల తర్వాత పోస్టులు పెడుతుండడంతో ప్రజలకు ఆలస్యంగా సమాచారం అందుతోంది. ఇక నిరక్షరాస్యులు, సోషల్ మీడియాకు దూరంగా ఉండేవారికి ప్రజావాణి సమాచారం అసలు తెలియడమే లేదు. దీనికి తోడు మండల, డివిజన్ కార్యాలయాల్లో ఇప్పటికే ఆయా సమస్యలపై వినతపత్రాలు అందజేసిన వారు.. పరిష్కారం కాకపోతే నేరుగా కలెక్టర్‌కు విన్నవించేవారు. కలెక్టర్ దృష్టికి వెళితే సమస్య పరిష్కారం అయ్యేది. అయితే ఇప్పుడు మండల, డివిజన్ కేంద్రాల్లోనే వినతులు ఇస్తే అవి పరిష్కారం కావనే భావనతో పలువురు గ్రీవెన్స్‌కు రావడం లేదని తెలుస్తోంది. ఇకపై కలెక్టరేట్‌లోనే ప్రజావాణి నిర్వహించాలని, లేదంటే డివిజన్, మండలాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌పై విస్తృత ప్రచారం చేయాలని పలువురు కోరుతున్నారు.

వెదురు సాగు లాభదాయకం

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



ములకలపల్లి : రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ములకలపల్లి : వెదురు సాగు ఎంతో లాభదాయకమని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండలంలోని మూకమామిడి, మొగరాలగుప్ప గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా పలువురు రైతుల చేలల్లో వెదురు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. సుమారు 1000 కి.మీ. నుంచి నాణ్యమైన వెదురు మొక్కలు తెప్పించినట్లు తెలిపారు. ఎకరానికి 160 మొక్కలు పెంచొచ్చని, వీటికి ముళ్లు ఉండవని, తక్కువ కాలంలో గడలు ఏపుగా పెరుగుతాయిని వివరించారు. మార్కెటింగ్ సౌకర్యం కూడా ఉంటుందని, రెండేళ్ల పాటు అంతరపంటగా బొబ్బెర, పెసర, జొన్న వంటి పంటల సాగుతో అదనపు ఆదాయం పొందొచ్చని చెప్పారు. పంట మార్పిడి పద్ధతి పాటించాలని, చేపల చెరువులు, కౌజు పిట్టల పెంపకంపై దృష్టి సారించాలని రైతులకు సూచించారు. అనంతరం మూకమామిడిలో అసంపూర్తిగా ఉన్న జీపీ కార్యాలయ భవనాన్ని పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని పీఆర్ ఏఈ సురేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, తహసీల్దార్ భుక్యా గన్యా, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏడీఏ రవికుమార్, ఎంఏఓ అరుణ్‌బాబు, ఏపీఓ హుస్సేన్, ఏఈలు వరప్రసాద్, గఫూర్ పాషా పాల్గొన్నారు.

విత్తన సేకరణ భేష్..

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు పంచాయతీ బంజర నెల్లిపాక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చేపట్టిన విత్తన సేకరణ భేష్ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రశంసించారు. హెచ్ఎం విమల ఆధ్వర్యంలో సేకరించిన 362 రకాల విత్తనాలను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. విత్తనాల సేకరణలో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలవడం అభినందనీమయని అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంఈఓ వీరస్వామి, ఎంపీఓ ముత్యాలరావు, ఏపీఓ సీతారాములు, పంచాయతీ కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

వెంకటమ్మా.. నీతో ఫొటో దిగాలి..

'మునగ తోటలో అంతరపంటగా బెండతోట సాగు చేస్తున్నారా .. సంతోషంగా ఉంది' అంటూ మహిళా రైతును కలెక్టర్ అభినందించారు. మొగరాలగుప్ప శివారులో ఎకరం విస్తీర్ణంలో మహిళా రైతు వెంటకమ్మ సాగు చేస్తున్న మునగ తోటను పరిశీలించారు. ఒకే భూమిలోపామాయిల్, మధ్యలో మునగ, ఖాళీ ప్రదేశంలో బెండ సాగు చేయడంపై అభినందించారు. ఆమెను పిలిచి మరీ ఫొటో దిగారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ

భద్రాచలం : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం దర్బార్‌లో దరఖాస్తులు అందించవద్దని, నిరుద్యోగులు, ప్రతిభ కలిగిన యువత స్వయం ఉపాధి ద్వారా జీవనోపాధి పొందడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే దిశగా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. చర్ల మండలం మొగ్గళ్లపల్లి గ్రామానికి చెందిన సులోచన, ఇతర మహిళలు నూతన ఇసుక సొసైటీ ఏర్పాటుకోసం, ములకలపల్లి మండలం పాత జెండాలపాడు గ్రామానికి చెందిన రమేష్ పొలంలో సోలార్ కనెక్షన్ ఇప్పించాలని, అశ్వారావుపేట మండలం అంజుబాకకు చెందిన రాజేశ్వరి భూ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఈఈ సత్యానందం, ఏఓ రాంబాబు, ఇన్‌చార్జ్ ఎస్‌ఓ భాస్కరన్, గురుకులాల ఆర్సీఓ అరుణకుమారి, వివిధ శాఖల అధికారులు ఉదయ్‌కుమార్, రాజారావు, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, హరికృష్ణ, నారాయణరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సిబ్బంది సమ్మె బాట.. టీచర్ల వంట బాట !



తమ సమస్యలు పరిష్కరించాలంటూ చంద్రుగొండ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల సిబ్బంది సోమవారం సమ్మెబాట పట్టగా ఉపాధ్యాయులు వంట పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో విద్యార్థులకు బోధనలో అంతరాయం కలిగింది. ప్రభుత్వం సత్వరమే స్పందించి సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. – చంద్రుగొండ

అతివల ఆరోగ్యంపై నజర్


మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

- 17 నుంచి స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం
- జిల్లావ్యాప్తంగా మహిళలకు వలు రకాల వైద్య పరీక్షలు
- ఏర్పాట్లు చేసిన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

చుంచుపల్లి: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, దేశం బాగుంటుందనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అతివలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సిద్ధమైంది. ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు గ్రామస్థాయి నుంచి నగరాల వరకు అన్ని చోట్లా 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. ఇటీవల కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో తగిన సూచనలు చేశారు. బుధవారం నుంచి జిల్లాలోని 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 పల్లె దావాఖానాలు, మరో 5 పట్టణ ఆరోగ్య కేంద్రాలు, 153 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ల పరిధిలో మహిళలకు వైద్యపరీక్షలు చేయనున్నారు.

పక్షంరోజులపాటు స్పెషల్ డ్రైవ్

పక్షం రోజులపాటు స్వాస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ స్పెషల్ డ్రైవ్ జరగనుంది. ఆరోగ్య మహిళ, ఏసీడీ సెంటర్లు, కేన్సర్ డే కేర్ సెంటర్లతో పాటు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రతి ఏడాది సెప్టెంబరులో నిర్వహించే పోషణ్ మా ప్రోగ్రామ్ కూడా ఈ కార్యక్రమాలతో కలిపి నిర్వహించనున్నారు. మారిన జీవనశైలి, వాతావరణం కారణంగా కొందరు మహిళలు వ్యాధుల బారిన పడుతున్నారు. శిబిరాల్లో హైబీపీ, షుగర్, ఓరల్ కేన్సర్, బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ తదితర పరీక్షలు చేపట్టనున్నారు. రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. క్షయ బారిన పడే ప్రమాదం ఉన్న మహిళలను గుర్తించి టీబీ పరీక్షలను చేయనున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సికెల్ సెల్ ఎనీమియా పరీక్షలతోపాటు బాధితలకు కార్డులను అందించి కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. గైనకాలజీ, నేత్ర, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, సైకియాట్రీ, డెంటల్ సర్జన్ తదితర వైద్యులు శిబిరాల్లో మహిళలకు పరీక్షలు నిర్వహిస్తారు. రోగ నిర్ధారణ అయితే తగిన చికిత్స, మందులు అందిస్తారు. ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని మార్గదర్శకాల్లో సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా మహిళల అనారోగ్య సమస్యలను గుర్తించి చికిత్స అందించేందుకు అవకాశం కలుగుతుంది.

ఏర్పాట్లు చేస్తున్నాం



జిల్లాలోని ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ అమలుపై వివిధ శాఖలకు దిశా నిర్దేశం చేశారు. అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లో ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. అందరి సహకారంతో విజయవంతం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

– డాక్టర్ ఎస్.జయలక్ష్మి, డీఎంహెచ్‌ఓ

యూరియా కోసం రైతుల తోపులాట

250 మంది వస్తే 100 మందికే ఒక్కో బస్తా చొప్పున పంపిణీ


కూపన్ల కోసం వేచి చూస్తున్న రైతులు

జూలూరుపాడు: జూలూరుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట జరిగింది. రైతులు సోమవారం ఉదయం 5 గంటలకే పీఏసీఎస్‌కు చేరుకుని తమ వంతు కోసం వరుసలో చెప్పులు పెట్టుకున్నారు. 6 గంటల నుంచి సుమారు 250 మంది రైతులు క్యూలైన్‌లో బారులుదీరారు. పీఏసీఎస్ ఉద్యోగులు కూపన్లు ఇవ్వడం ప్రారంభించాక, కూపన్లకు తమ వరకు వస్తాయో, రావోననే ఆందోళనతో కొందరు రైతులు క్యూలైన్ నుంచి ముందుకు వెళ్లారు. ఈ క్రమంలో తోపులాట జరిగి, ఘర్షణకు దారితీసింది. మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు నచ్చజెప్పడంతో సద్దుమణిగింది. పీఏసీఎస్ ఉద్యోగులు 100 మంది రైతులకు కూపన్లు అందించి, ఒక్కో యూరియా బస్తా చొప్పున పంపిణీ చేశారు. మరో 150 మంది రైతులు యూరియా దొరకక నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయంపై సహకార సంఘం సెక్రటరీ రమణారెడ్డిని వివరణ కోరగా.. కూపన్ పొందిన రైతులకు ఒక యూరియా బస్తా చొప్పున అందించామని, సహకార సంఘం కార్యాలయంతోపాటు, పడమటనర్సాపురం రైతు వేదికలో కూడా యూరియా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఫలించిన రైతుల భగీరథ ప్రయత్నం

పట్టువదలని విక్రమార్కులు మల్లయ్య, వీరయ్య, భీష్మారెడ్డి


తుమ్మలచెరువు షట్టరు ఎత్తుతున్న మల్లయ్య, వీరయ్య, భీష్మారెడ్డి, రైతులు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు ఆయకట్టు రైతుల భగీరథ ప్రయత్నం ఫలించింది. చెరువు తూముల షట్టర్లు మరమ్మతులకు గురై నిండు కుండలా ఉన్నా చెరువు రెండు షట్టర్లు లేవక నీరు రాక ఇబ్బంది పడుతున్న రైతుల కష్టాలు తీరాయి.తుమ్మలచెరువు అలుగు తూము షట్టరును సోమవారం మెకానిక్ కొమ్ము మల్లయ్య, కొమ్ము వీరయ్య, కల్లెం భీష్మారెడ్డి సహకారంతో రైతులు షట్టరును ఎత్తారు. నీటిపారుదల శాఖ అధికారులు, గజ ఈతగాళ్ల వల్ల సాధ్యంకాని పనిని మెకానిక్ కొమ్ము మల్లయ్య చైన్ బ్లాక్ సాయంతో పట్టు వదలకుండా రైతుల సహకారంతో తుమ్మలచెరువు ప్రధాన తూము, అలుగు తూము షట్టరులు లేపి రైతులకు నీరు అందించాడు. భీష్మారెడ్డి సాహసంతో 20 అడుగుల నీళ్లలో మునిగి షట్టరుకు లంగర్ వేయగా చైన్‌బ్లాక్‌తో షట్టరును పైకి ఎత్తారు. రెండు రోజుల క్రితం కొమ్ము మల్లయ్య ప్రధాన తూమును లేపాడు. దీంతో ఆయకట్టు రైతులు కొమ్ము మల్లయ్య, వీరయ్య, భీష్మారెడ్డిని అభినందించారు.

లభ్యంకాని మరో మహిళ ఆచూకీ

మూడు రోజులుగా కొనసాగుతున్న గాలింపు చర్యలు


పెదవాగులో బోటు సాయంతో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ కూలీలు వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన ఘటనలో ఇంకా ఓ మహిళా కూలీ ఆచూకీ తెలియరాలేదు. సోమవారం కూడా అశ్వారావుపేట మండలంలోని పెదవాగు పరిసరాలతోపాటు అటవీ ప్రాంతాల్లో గాలింపు చర్యలు కొనసాగాయి. గత శనివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో అశ్వారావుపేట మండలంలోని గోపన్నగూడెం–కన్నాయిగూడెం వాగును దాటే క్రమంలో ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన ఏడుగురు కూలీల్లో ఇద్దరు కూలీలు పాలడుగుల చెన్నమ్మ(60), పచ్చిసాల వరలక్ష్మి(55) గల్లంతైన సంగతి తెలిసిందే. కాగా, వీరిలో చెన్నమ్మ మృతదేహాన్ని అశ్వారావుపేట మండలం అనంతారం గ్రామ శివారులోని చెక్ డ్యాం వద్ద పోలీసులు గుర్తించి కుటుంబీకులకు అప్పగించారు. మరో మహిళ వరలక్ష్మి ఆచూకీ మాత్రం ఇంకా లభ్యం కాలేదు. దీంతో స్థానిక అధికారులతోపాటు ఏపీ అధికారులు, ఎన్డీఆర్ఎస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. వాగు దట్టమైన ప్రాంతం గుండా ప్రవహించడంతో మార్గమధ్యలోని అటవీ ప్రాంతానికి వెళ్లేందుకు సాధ్యం కావడంలేదు. దీంతో ఏపీ పోలీసులు డ్రోన్ కెమెరా సాయంతో ఆచూకీ కోసం యత్నిస్తున్నారు. మండలంలోని అనంతారం, నెమలిపేట, నారాయణపురం, బచ్చువారిగూడెం మీదుగా పెదవాగు వరదనీటి ప్రవాహంలో బోటు సాయంతో సిబ్బంది గాలింపు కొసాగిస్తుండగా, స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, ఎస్సై రామ్మూర్తి పర్యవేక్షిస్తున్నారు. మూడు రోజులైనా వరలక్ష్మి ఆచూకీ తెలియకపోవడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరు విలపిస్తున్నారు.

రాజ్యలక్ష్మి మోటార్స్‌లో షార్ట్ సర్క్యూట్

రూ.20 లక్షల విలువైన కొత్త, పాత వాహనాలు దగ్ధం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాల్వంచ: పట్టణంలోని బీసీఎం రోడ్‌లో ఉన్న రాజ్యలక్ష్మి మోటార్స్‌లో సోమవారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో మంటలు వ్యాపించి షోరూం నుంచి దట్టమైన పొగ వస్తుండటంతో స్థానికులు గుర్తించి నిర్వాహకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని షట్టర్లు తెరిచి చూడగా, భారీ ఎత్తున మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు. నిర్వాహకుల సమాచారంతో కొత్తగూడెం నుంచి ఫైర్ ఇంజన్‌తో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే మంటల్లో కొత్త, పాత వాహనాలు దగ్ధమయ్యాయి. సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు శ్రీనివాస్ తెలిపారు. పూర్తి అంచనా వేయాల్సి ఉందన్నారు.

బొప్పాయి సాగుకు నగదు ప్రోత్సాహకం


బొప్పాయి తోటను పరిశీలిస్తున అధికారులు

జూలూరుపాడు: బొప్పాయి సాగు చేస్తే ఎకరానికి రూ. 12 వేల నగదు ప్రోత్సాహకం అందిస్తామని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి జె.కిషోర్ అన్నారు. బొప్పాయి సాగు చేసిన జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల రైతులు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోగా తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొప్పాయి తోటలకు ఎంఐడీహెచ్ పథకం ద్వారా 40 శాతం సబ్సిడీ, ఎకరానికి రూ.12వేల ప్రోత్సాహకం అందించనున్నట్లు చెప్పారు. ఎకరం విస్తీర్ణంలో 1,234 మొక్కలు అవసరమని, తొమ్మిది నెలల్లో దిగుబడి వస్తుందని తెలిపారు. ఎకరానికి 30 టన్నుల మేర దిగుబడి ఉంటుందని చెప్పారు.

ఇసుక లారీ ఢీకొని దంపతులకు గాయాలు

దుమ్ముగూడెం : మండలంలోని చిన్ననల్లబల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఇసుక లారీ ఢీకొని భార్యాభర్తలకు గాయాలయ్యాయి. బండిరేవు గ్రామానికి చెందిన గాలి అచ్చుతరావు–స్వరూప దంపతులు తమ గ్రామం నుంచి భద్రాచలం వెళ్తుండగా చిన్ననల్లబల్లి గ్రామంలో ఇసుక లారీ ఢీ కొట్టింది. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అనంతరం వరుసగా వస్తున్న ఇసుక లారీలను గ్రామస్తులు నిలిపివేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇసుక లారీలను పంపించారు.

కారు, లారీ ఢీ : ఒకరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ సమీపంలో మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రధాన రహదారిపై కారు, లారీ అదుపు తప్పి ఢీకొని రహదారి వెంబడి పొలాల్లోకి దూసుకుపోయాయి. ప్రమాదంలో కారులో ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా 108లో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయాలైన వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆదివాసీ యువకుడు మృతి

పాల్వంచరూరల్: ఆదివాసీ గిరిజన యువకుడు సోమవారం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని బంద్రుగొండ గ్రామపంచాయతీ కొయ్యగట్టు గ్రామానికి చెందిన పాడియం అనిల్ (20) కొంతకాలంగా శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో నోట్లనుంచి నురుగు రావడంతో భార్య జోగి గమనించింది. అంబులెన్స్‌లో పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అందించాక మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అనారోగ్యంతోనో, ఏదైనా విషపురుగు కుట్టో చనిపోయాడని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య జోగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసు నమోదు

భద్రాచలంటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు సోమవారం లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. పట్టణ ఎస్‌ఐ సతీష్ కథనం ప్రకారం... ఒడిశాకు చెందిన ఓ మహిళ అనారోగ్య సమస్యతో ఆదివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చింది. ఆమెను పరీక్షించిన వైద్యుడు ఎక్స్‌రే రాశాడు. ఆస్పత్రిలోని ఎక్స్‌రే సెంటర్‌కు వెళ్లగా ఎక్స్‌రే తీసే క్రమంలో అక్కడి పని చేస్తున్న టెక్నీషియన్ శివశంకర్ మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో ఆమె ఆస్పత్రి యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా టెక్నీషియన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు బోల్తా, నలుగురికి గాయాలు

ముదిగొండ: ఖమ్మం–కోదాడ నేషనల్ హైవేపై ముదిగొండ మండలం వెంకటాపురం సమీపాన ప్రమాదవశాత్తు సోమవారం కారు బోల్తా పడింది. ఖమ్మం నుంచి నాగమ్మ, నరేందర్, బాలకృష్ణ, శేఖర్ కారులో కోదాడ వైపు వెళ్తుండగా టైరు పంక్చర్ కావటంతో బోల్తా పడగా నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి.

ఏపీ పోలీసుల దౌర్జన్యం

- స్థానిక పోలీసుల అనుమతి లేకుండా ఓ ఇంట్లోకి చొరబాటు
- కోడిపుంజుల నెపంతో మహిళపట్ల దురుసు ప్రవర్తన
- సీసీ కెమెరాల ధ్వంసం, హార్డ్ డిస్కుల స్వాధీనం
- ఆంధ్రా పోలీస్ వాహనాన్ని అడ్డుకున్న దమ్మపేట గ్రామస్తులు


ఏపీ పోలీసుల వాహనాన్ని చుట్టుముట్టిన దమ్మపేట గ్రామస్తులు

దమ్మపేట : దమ్మపేట గ్రామంలోని కాపుల బజార్‌లో సోమవారం ఓ ఇంట్లోకి అక్రమంగా చొరబడిన ఏపీ పోలీసులు, మహిళపై దురుసుగా ప్రవర్తించారు. సీసీ కెమెరాలను పగులకొట్టారు. స్థానికుల కథనం ప్రకారం... ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పట్టాయిగూడెం గ్రామానికి చెందిన రంగనాథ్ అనే వ్యక్తి ఇంట్లో నాలుగు పందెం కోడి పుంజులను దమ్మపేటకు చెందిన వ్యక్తి దొంగిలించాడనే నెపంతో వచ్చారు. చింతలపూడి పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్, హోంగార్డు, రంగనాథ్‌తోపాటు మరో 20 మంది వ్యక్తులు నాలుగు కార్లలో దమ్మపేటలోని కాపుల బజారుకు వచ్చారు. స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం అందించకుండా, అనుమతి తీసుకోకుండా గోపవరపు శేషు అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించారు. ఇంటికి ఉన్న రెండు గేట్లను మూసేసి, ఇంటి ముందు ఉన్న రెండు సీసీ కెమెరాల వైర్లను కట్ చేశారు. సీసీ కెమెరాలకు సంబంధించిన హార్డ్ డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న శేషు భార్య రాజేశ్వరి ప్రశ్నించగా... నీ భర్త కోడిపుంజుల దొంగతనాలతోనే ఇంత సంపాదించాడా అంటూ పోలీసులు ఆమె పట్ల దురుసుగా మాట్లాడారు. బలవంతంగా బీరువా తెరిపించి శేషు ఆధార్ కార్డు తీసుకున్నారు. వారు పెంచుకుంటున్న కోడి పుంజులను పోలీసులతో వచ్చిన వ్యక్తులు స్వాధీనం చేసుకుని, ఆమెను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో ఆ వీధిలో నివాసం ఉంటున్న గ్రామస్తుల వందల సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. ఏపీ పోలీసులను, వారితో వచ్చిన వ్యక్తులను, వాహనాలను అడ్డుకున్నారు. ఒంటరిగా ఉన్న మహిళపై దౌర్జన్యం ఏమిటని నిలదీశారు. పోలీసులను, వారి కారును కదలన్వికుండా దాదాపు నాలుగు గంటలపాటు ముట్టడించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానిక పోలీసులు ఏపీ పోలీసుల వాహనాన్ని దమ్మపేట స్టేషన్‌కు తరలించారు. బాధిత మహిళ రాజేశ్వరి చింతలపూడి పోలీసుల దౌర్జన్యంపై దమ్మపేట ఠాణాలో ఫిర్యాదు చేశారు.

ఆదర్శనీయుడు.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వర్లు


విశ్వేశ్వర్యయ్య విగ్రహానికి నివాళులరిస్తున్న సింగరేణి అధికారులు

కొత్తగూడెంఅర్బన్: దేశం గర్వించదగ్గ ఇంజనీర్, ఆదర్శనీయుడు భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని సింగరేణి డైరెక్టర్(పీపీ) కె.వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ వద్ద భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి, ఇంజనీర్స్ డే వేడుకలు నిర్వహించారు. విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువ ఇంజనీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తిగా తీసుకుని ఇంజనీరింగ్‌లో ప్రగతి చాటాలని సూచించారు. ఇంజనీర్లు నూతన టెక్నాలజీని ఉపయోగిస్తూ విలువలతో కూడిన ఇంజనీరింగ్ పనితనంతో నాణ్యమైన ప్రాజెక్టులను నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సింగరేణి జీఎంలు డి.వెంకటేశ్వర్లు, కె.సాయిబాబు, సీహెచ్.శ్రీనివాస్, టి.వెంకట రామి రెడ్డి, బి.శ్రీనివాస రావు, జీవీ కిరణ్ కుమార్, మురళీధర రావు, ఎస్.వెంకటాచారి, ఎస్.వి.రామమూర్తి , ఎం.కనకయ్య, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మీపతి గౌడ్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పీతాంబరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం


మాట్లాడుతున్న శైలేంద్రసింగ్

బూర్గంపాడు: దేశ పురోగతిలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకమని ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్ అన్నారు. సారపాకలోని ఐటీసీలో సోమవారం జరిగిన ఇంజనీర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ పారిశ్రామిక ప్రగతి, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజనీర్ల కృషి వెలకట్టలేనిదని అన్నారు. తొలుత మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐటీసీ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వర్షానికి కొట్టుకుపోయిన వేరుశనగ చేలు

ఎకరానికి రూ. 50 వేల చొప్పున నష్టం


వేరుశనగ విత్తనాలు కొట్టుకుపోయిన చేలో బాధిత రైతు

అశ్వారావుపేట: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అశ్వారావుపేట మండలంలోని పలు వ్యవసాయ క్షేత్రాలు నీట మునుగుతున్నాయి. పండువారిగూడెం గ్రామానికి చెందిన కలిదిండి వెంకట నర్సింహ రాజు 40 ఎకరాల్లో వేరుశనగ నాటేందుకు చేను సిద్ధం చేసుకున్నాడు. శుక్రవారం నాటికి 20 ఎకరాలు విత్తనాలు వేశారు. ఆ తర్వాత వర్షం రావంతో 20 ఎకరాల్లో వేరుశనగ విత్తనాలు కొట్టుకుపోయాయి. ఎకరానికి రూ.50 వేలు చొప్పున రూ.10 లక్షలు నష్టపోయినట్లు రైతు వాపోతున్నాడు. రామన్నగూడెం, నారాయణపురం గ్రామాల్లో కూడా వేరుశనగ చేలు నీట మునిగాయి. వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లా మార్కెట్ చైర్మన్ల ఫోరం ఏర్పాటు

గౌరవ అధ్యక్షుడిగా హన్మంతరావు


యరగర్ల హన్మంతరావు

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల ఫోరం ఏర్పాటైంది. రాష్ట్ర ఫోరం తరహాలో ఉమ్మడి జిల్లా ఫోరంను ఏర్పాటు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 14 మార్కెట్లకు గాను తొమ్మిది మార్కెట్లకు పాలకవర్గాలు ఉన్నాయి. ఈ మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో సమావేశమైన చైర్మన్లు ఫోరం ఏర్పాటు చేసుకున్నారు. ఫోరం గౌరవ అధ్యక్షుడిగా ఖమ్మం ఏఎంసీ చైర్మన్ యరగర్ల హన్మంతరావును ఎన్నికయ్యారు. అలాగే, అధ్యక్షుడిగా బండారు నరసింహారావు(మధిర), ఉపాధ్యక్షులుగా బాగం నీరజ(కల్లూరు), కార్యదర్శిగా దోమ ఆనంద్‌బాబు(సత్తుపల్లి), సహాయ కార్యదర్శిగా టి. సీతమ్మ(భద్రాచలం),, కోశాధికారిగా ఇరుప శ్రీనివాసరావు(చర్ల)ను ఎన్నుకున్నారు. త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విధులు నిర్వర్తిస్తామని హన్మంతరావు తెలిపారు.

క్లుప్తంగా

న్యూఢిల్లీలో ఉపాధ్యాయుల సాంస్కృతిక ప్రదర్శన


న్యూఢిల్లీలో వివిధ వేషధారణల్లో తెలంగాణ ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం : సీసీఆర్‌టీ న్యూఢిల్లీలో జరుగుతున్న ఎన్ఈపీ–2020 శిక్షణలో సోమవారం మండలంలోని పెదపాడు ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు ఎం.మోహన్‌కుమార్ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. తెలంగాణ కళలు, విద్య, ఆహార విధానం, సంస్కృతి తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రం నుంచి హాజరైన ఉపాధ్యాయులు తెలంగాణ సంప్రదాయ వేషధారణలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

'ఐకార్'లో అశ్వారావుపేట విద్యార్థుల ప్రతిభ

అశ్వారావుపేట: ఐకార్ నిర్వహించే జాతీయ స్థాయి అగ్రికల్చరల్ పీజీ ప్రవేశ పరీక్షలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల 2021 బ్యాచ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జే హేమంత కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐఈఈఏ పీజీ 2025 ప్రవేశ పరీక్షలో దనసరి నాగ చైతన్య శబరి (అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్)లో ఆల్ ఇండియా 10వ ర్యాంకు, కేటగిరీలో 1వ ర్యాంకు, బండ అఖిల్ కీటక శాస్త్రంలో 11, 2 ర్యాంకులు, హలావత్ చిన్నారి అగ్రానమీ)లో 64, 02, తిప్పా నాగ వినయ్‌కు మార్ ప్లాంట్ సైన్సెస్ 166, 73, రమావత్ కళ్యాణి కీటకశాస్త్రంలో 187, 06, మృత్తిక శాస్త్రంలో షేక్ సఫీనా 60, 24, దేవరసెట్టి యమున 104, 49, మద్దెల యామని 131, 33 ర్యాంకులు సాధించినట్లు వివరించారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక


ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీఓ ఏపీడీ రవి

కరకగూడెం: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీవో ఏపీడీ ఎన్.రవి, విజిలెన్స్ ఆఫీసర్ రమణారావు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక ఏర్పాటు చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలవ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో రూ.5,94,54,175 కోట్ల విలువైన ఉపాధి హామీ పనులు చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఆ పనుల్లో గుర్తించిన లోపాలకు సంబంధించి ఆయా పంచాయతీలపై రూ.55,261 రికవరీకి ఆదేశించారు. రూ.11,000 పెనాల్టీ విధించారు. పంచాయతీ కార్యదర్శులు పని ప్రదేశంలో కూలీల మస్టర్లపై రోల్ కాల్ చేయకపోవడం, హాజరు గణనలో తప్పిదాలు, మస్టర్లపై అధికారుల సంతకాలు లేకపోవడం, పనుల ప్రదేశాల్లో నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం వంటి లోపాలను గుర్తించారు. 4వ విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి 14వ తేదీ వరకు అధికారులు గ్రామాల్లో పర్యటించి చేసిన ఉపాధి పనులను తనిఖీ చేసి, గ్రామసభల ద్వారా ప్రజలకు సమాచారం అందించారు. ఎంపీడీఓ కుమార్, ఎంపీఓ మారుతీ యాదవ్ పాల్గొన్నారు.

ఆదివాసీ విద్యార్థినికి బంగారుపతకం

కారేపల్లి: మండలంలోని తొడితలగూడేనికి చెందిన ఆదివాసీ విద్యార్థిని ఎట్టి ప్రియకు బంగారు పతకం లభించింది. మహాత్మాగాంధీ యూనివర్సిటీ నుంచి బీఈడీ పూర్తిచేసిన ఆమె యూనివర్సిటీ స్థాయి ఫలితాలు సాధించడంతో బంగారు పతకం ప్రకటించారు. ప్రియ తండ్రి రమణ ఆమె చిన్నతనంలోనే మృతిచెందగా, తల్లి కోటేశ్వరి కూలి పనులకు వెళ్తూ చదివించింది.

అటవీ జంతువుల వేటకు కరెంట్ ఉచ్చులు

కామేపల్లి: అటవీజంతువులను వేటాడేందుకు కరెంట్ ఉచ్చులు ఏర్పాటు చేయగా, కామేపల్లి మండలంలో అధికారులు గుర్తించారు. మండలంలోని హరి శ్చంద్రాపురం శివారు పంట చేలల్లో జంతువులను వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు 11 కేవీ విద్యుత్ లైన్ నుంచి నేరుగా వైర్లను అమర్చారు. ఈ నేపథ్యాన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగడంతో ఉద్యోగులు పరిశీలిస్తుండగా ఉచ్చులు బయటపడ్డాయి. దీంతో అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి వైర్లను తొలగించారు. కాగా, ఈ ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,107